ఆకతాయిలకు అడ్డాగా పడగల్ రైల్వేస్టేషన్

- నియామకం కాని సిబ్బంది
- స్టేషన్ గదులు, ఫర్నిచర్ ధ్వంసం
- రైల్వే ఆస్తులకు భద్రత కరువు

వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ రైల్వేస్టేషన్ అలంకారప్రాయంగా మారింది. రైల్వేస్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో దానిని పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో గదులు, ఎలక్ట్రికల్ వస్తువులు, ఫర్నిచర్‌ను ఆకతాయిలు ధ్వంసం చేశారు. రైల్వేస్టేషన్ వాడుకలో లేక ఆకతాయిలకు అడ్డాగా మారింది. రైల్వేస్టేషన్‌ను ప్రారంభించి ఎనిమిదేళ్లు అవుతున్నా సిబ్బందిని నియమించకపోవడంతో రైల్వేస్టేషన్ ఉపయోగం లేకుండా పోతోంది. 63 నంబరు జాతీయ రహదారికి సమీపంలో, వేల్పూర్‌కు వెళ్లేదారిలో పడగల్ రెవెన్యూ శివారులో రైల్వేస్టేషన్‌ను నిర్మించారు. 2017 వేసవిలో నిజామాబాద్, కరీంనగర్ రైలు ప్రారంభించినపుడు ఈ స్టేషన్‌ను నిర్మించారు. ఇక్కడ సిబ్బందిని నియమించలేదు. అప్పట్నుంచి కొన్నేళ్లు ప్యాసింజర్ రైల్లు ఇక్కడ ఆగి వెళ్లడమే కాని, ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చే సౌకర్యం కల్పించలేదు. కాచిగూడ, కరీంనగర్ డెమూ, బోధన్ కరీంనగర్ మెమూ ప్యాసింజర్


ముళ్లపొదలతో నిండిన పడగల్ రైల్వేస్టేషన్

రైల్లు, వీటితో పాటు గూడ్స్ రైళ్లు రామగుండం నుంచి నిజామాబాద్, మహారాష్ట్రవైపు అధికంగా వెళ్తుంటాయి. కాచిగూడ, కరీంనగర్ రైలుద్వారా నిజామాబాద్ నుంచి వేల్పూర్, లక్కోర, అమీనాపూర్, పడగల్, అంక్సాపూర్ గ్రామాల ప్రయాణికులు రావడానికి అవకాశం ఉంటుంది. ఈ స్టేషన్ నుంచి రైల్వేశాఖకు ఆదాయం రావడం లేదన్న సాకుతో సుమారు రెండేళ్ల నుంచి ఇక్కడ రైళ్లు నిలపడం లేదు. వేల్పూర్ రహదారికి సుమారు అరకిలోమీటరుకుపైగా దూరంలో రైల్వేస్టేషన్ ఉంది. అక్కడికి సొంతంగా వాహనాలు తీసుకెళ్తే తప్ప, ప్రయాణికులకు ఇతర వాహనాల సౌకర్యం లభించదు. తమ ప్రాంతం


ధ్వంసమైన కేబిన్ తలుపు, కిటికీలు

మీదుగా రైలు సౌకర్యం ఉన్నా, ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

మండల ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడం లేదు. దాంతో రైల్వేస్టేషన్ వృథాగా ఉంటోంది. రైల్వేస్టేషన్ కేవలం అలంకారం ప్రాయంగా మిగిలింది. రైల్వే అధికారులు చర్యలు తీసుకొని రైల్వేస్టేషన్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి. – తీగెల మధుకర్, వేల్పూర్

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


మాణిక్‌భండార్‌లో కొమరంభీం విగ్రహం ఎదుట జెండా ఎగరవేస్తున్న ఆదివాసీ నాయక్‌పోడ్‌లు


మెండోరాలో జెండాను ఆవిష్కరించిన నాయకులు

మాక్లూర్/డొంకేశ్వర్/బాల్కొండ/: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఆదివాసీ, నాయక్‌పోడు నాయకులు ఘనంగా నిర్వహించారు. మాక్లూర్ మండలం మాణిక్‌భండార్, మదన్‌పల్లితండా, మాదాపూర్, డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం గ్రామాల్లో, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని గ్రామాల్లో నాయకులు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా కొమరంభీం విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాదాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తోటి కులం రాష్ట్ర కన్వీనర్ అత్రం కమల్ హాజరై మాట్లాడారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం మాక్లూర్ మండల మాజీ అధ్యక్షుడు ఆకుల రవి, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి దుడ్డు గంగాధర్, సుంకరి అనీల్, రాస సాయిలు, సుంకరి శ్రీనివాస్, బాలయ్య, లక్ష్మన్, లింగం, నాయక్‌పోడు సంఘం డొంకేశ్వర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, హన్మండ్లు, భోజన్న, సత్తెన్న, వంశీ, సాయన్న, మధు, వేల్పూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, , పీఏసీఎస్ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, తోటి సంఘం, ఆదివాసీ నాయకపోడు కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నయానంలో నినాదాలు చేస్తున్న నాయకులు


ఇత్వార్‌పేట్‌లో..


అందాపూర్‌లో కొమరంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

కొమరంభీం వీరత్వం మరవలేనిది

పెర్కిట్(ఆర్మూర్): ఆదివాసీలకు అండగా ఉంటూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కొమరంభీం వీరత్వం చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. ప్రపంచ ఆదివాసి నాయకపోడు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసి నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలం అందాపూర్ గ్రామంలో శనివారం కొమరంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ జల్, జమీన్, జంగ్ నినాదంతో కొమరంభీం ఆదివాసీల హక్కుల కోసం పోరాడన్నారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు సంఘం నాయకులు మేకల భూమన్న, బొంత భూమన్న, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరయ్యాయని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగంపేట్‌లో నాయకపోడు సంఘ భవన నిర్మాణానికి రూ.4.5 లక్షలు, వెంచిర్యాల్‌లో బంగారు వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 4 లక్షలు మంజూరయ్యాయన్నారు. మెండోరా మండలంలోని సావెల్ గ్రామంలో మున్నూరు కాపు సంఘ భవనానికి రూ.4.5 లక్షలు మంజూరైనట్లు మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి తెలిపారు ఈసందర్భంగా మంజూరుకు కృషి చేసిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌కు, బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్య సమాజ్‌లో శ్రావణి ఉపాకర్మ యజ్ఞం



బోధన్: పట్టణ కేంద్రంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో గల ఆర్య సమాజ్ మందిరంలో శనివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రావణి ఉపాకర్మ, ఆర్య సమాజ్ సత్యాగ్రహ బలిదాన దినోత్సవం, రక్షా బంధన్ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుడు ప్రణవ్‌కుమార్ యజ్ఞం ప్రక్రియను నిర్వహించి శ్రావణి ఉపాకర్మ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ముందుగా ఓం గుర్తు ఉన్న పతాక ఆవిష్కరణ చేశారు. ఆర్య సమాజ్ ప్రతినిధి ప్రదీప్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి



బోధన్: శ్రావణ మాస శనివారం, రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో భక్తులు రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలోని అష్టముఖ కొనేరులో భక్తులు స్నానమాచరించి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ, ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేసింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



మాక్లూర్: మండలంలో గుత్ప గ్రామంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల యూత్ అధ్యక్షుడు సిరికొండ మహేష్, అధ్యక్షుడు నీలగిరి శ్రీనివాస్‌లు శనివారం అందజేశారు. వంజరి నాగన్నకు రూ. 17వేలు, బ్యాగరి రవితేజకు రూ. 21 వేలు మంజూరుకావడంతో సంబంధిత చెక్కులను బాధితులకు వారు అందించారు. ధర్మయ్య, బాస్కర్, నర్సారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా సాముహిక పారాయణం



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించు కుని భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీహనుమాన్ చాలీసా, శ్రీరామరక్షా స్తోత్రం సామూహికంగా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి శనివారం ఉదయం 8 గంటలకు హనుమాన్ చాలీసా రామరక్షా స్తోత్రం పారాయణం సామూహిక పారాయణం ఉంటుందని భక్తులు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామంలో హైమాస్ట్ లైట్లను బీజేపీ కార్యదర్శి నక్క రాజేశ్వర్ శనివారం ప్రారంభించారు. లైట్ల ఏర్పాటుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. నాయకులు బెల్దారి బొర్రన్న, పెద్ద బాలయ్య, గంగాధర్, వెంకన్న, వినయ్, గంగాధర్, సాయిలు, శ్రీనివాస్, తదితరులున్నారు.

నేడు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ఆర్మూర్: ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించాలనే డిమాండ్‌తో ఆదివారం పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, జిల్లా నాయకుడు ముత్తన్న పేర్కొన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లిమిట్‌ను రూ.5 లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచామని చెప్పుకోవడమే తప్ప ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిలు ఇవ్వకపోవడంతో పేదవాళ్లకు ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదని గుర్తు చేశారు. విద్య వ్యవస్థలో జిల్లా మండల స్థాయిలోకి కార్పొరేట్ వ్యవస్థ ప్రవేశించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాస్‌లైన్ ఆర్మూర్ మండల సంయుక్త కార్యదర్శి కిషన్, అరవింద్, రవి, నరేష్, నిఖిల్, నజీర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఘనంగా యజ్ఞోపవీత ధారణ


మార్కండేయ ఆలయంలో యజ్ఞోపవీతం నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండాగల్లీలో గల శివ పంచాయతన నవగ్రహ వేంకటేశ్వర ఆలయంలో నవనాథపురం బ్రాహ్మణ సేవా సంఘం, చిన్నాబర్‌లో గల లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రీయ సమాజ్, పాతబస్టాండ్ సమీపంలో గల మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం యజ్ఞోపవీతధారణ కార్యక్రమం నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా యజ్ఞపవీత ధారణ, గాయత్రిమాత పూజ, హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మార్కండేయ మందిరం అధ్యక్ష,కార్యదర్శులు మోహన్‌దాస్, కొక్కుల రమాకాంత్, భాస్కర్, విద్యాసాగర్, రుద్ర రాజేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో ఆర్మూర్ డీఈఈ రమేశ్ శనివారం పూజకార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. చాలా రోజులుగా గ్రామంలో విద్యుత్ లోవోల్టేజి కారణంగా తరచూ కరెంటు సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని గ్రామస్తులు విన్నవించగా, కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామంలో విద్యుత్ సమస్య తీర్చిన డీఈఈ రమేశ్, వేల్పూర్ ఏఈ జశ్వంత్ రావు, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఆర్మూర్ ట్రాన్స్‌కో డీఈఈ రమేశ్, అధికారులు

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


ముప్కాల్ మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/రుద్రూర్ : జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పలు చోట్ల నాయకులు ఘనంగా నిర్వహించారు.ఆర్మూర్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద నాయకులు జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ మాట్లాడారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు యూత్ కాంగ్రెస్‌జెండాను ఆవిష్కరించారు.పోతంగల్ మండల కేంద్రంలో కోటగిరి ఉమ్మడి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ చాంద్ పాష యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో బాల్కొండ, ముప్కాల్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తౌటు అర్వింద్, ధనుష్‌యాదవ్, యూత్ నాయకులు షరీఫ్, గంగాధర్, సంతోష్‌గౌడ్, హేమంత్, ఆకుల రమేశ్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, మండల అధ్యక్షుడు తలారి రాకేష్, శివ, నవనీత్, లక్ష్మణ్, నరేందర్, గంగారాజు వినోద్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల శంకర్, డీసీసీ డెలిగేట్ కొట్టం మనోహర్ , మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండ మండల కేంద్రంలో..


పోతంగల్‌లో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

వైభవంగా చౌడేశ్వరీ దేవి జాతర


చౌడేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఉత్సవాల్లో పాల్గొన్న మంగిరాములు మహరాజ్

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామంలోని చౌడేశ్వరీ ఆలయ జాతర ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈజాతరను గ్రామస్తులు ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తారు. నూతన ఆలయం పునప్రతిష్ఠాన సందర్భంగా జాతర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం నుంచి నిజామాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని శివ లింగానికి, ఆంజనేయస్వామికి పూజలు చేశా రు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆలయ ప్రాంగణంలో రాఖీ పర్వదినం సందర్భంగా ఆంజనేయ స్వామి విగ్రహాన్ని కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ప్రతిష్ఠించారు. అనంతరం చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికుడైన వెలుమల నర్సయ్య తన సొంత ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ శ్యాంరావు, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు, దేవిదాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రెంజల్/రుద్రూర్: నూతన పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని రెంజల్ ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సిద్ది రామేశ్వర్, పోతంగల్, కోటగిరి వ్యవసాయాధికారులు నిశిత, రాజు తెలిపారు. ఈఏడాది జూన్ 6వ తేదీ లోపు కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 12వ తేదీలోపు రైతువేదికల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుతో పాటు రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జతపరచాలని సూచించారు. నామినీలో మార్పులు, చేర్పులకు క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రాఖీ వేడుక


ఆర్మూర్‌లోని గోల్‌బంగ్లాలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు పద్మావతి

సాక్షి, నెట్‌వర్క్ : అన్నా చెల్లెల్ల, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతికైన రాఖీ పండుగను శనివారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. అక్కచెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అన్నదమ్ములు అక్కాచెల్లెల్ల అశీర్వాదం తీసుకున్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో, నవీపేటలో పద్మశాలి సంఘం, నందిపేటలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం చేసి జంధ్యాలు ధరించారు. ఒమాన్, కువైట్, సౌది అరేబియా, దుబాయ్, బహ్రెయిన్, ఖతర్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణ వలస కార్మికులు తమ పనులు ముగించుకున్న తరువాత క్యాంపులలో రాఖీలు కట్టుకుని సంబరాలను నిర్వహించారు. తమ ఇళ్ల నుంచి సోదరీమణులు పంపిన రాఖీలను కార్మికులు ఒకరికి ఒకరు కట్టుకుని స్వీట్లు పంచుకున్నారు. రాఖీ సంబరాలను సామాజిక మాధ్యమాల ద్వారా తమ వారితో సంతోషంగా పంచుకున్నారు. మహిళలకు హక్కులు, అధికారాలు కల్పించిన అంబేద్కర్ తొలి అన్నయ్య అని పాలెంకు చెందిన అలేఖ్యా మహారాణి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం అంబేద్కర్ చిత్రపటానికి రాఖీ కట్టి సంబరాలను జరుపుకున్నారు.


ఒమాన్‌లోని కంపెనీ క్యాంపులో..


నవీపేట మండలం మోకన్‌పల్లి కేజీబీవీలో ..


నందిపేట ఎంఈవో గంగాధర్‌కు..


బాల్కొండ మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..


ముప్కాల్ మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహిస్తున్న పద్మశాలిలు


పాలెంలో అంబేద్కర్ చిత్రపటానికి రాఖీ కడుతున్న మహిళలు

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో గల స్వయంభూ శిలాతీర్థ వేంకటేశ్వర ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకీసేవతో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు నర్సారెడ్డి, బొజ్జ సంజీవ్, వేముల భూమేశ్వర్, తదితరులున్నారు.



వైభవంగా గిరిప్రదక్షిణ ప్రారంభం


రంగనాథుని గిరి ప్రదక్షిణను పూజతో ప్రారంభిస్తున్న పండితులు

బాల్కొండ: బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామ శివారులో గల రంగనాథుని ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ ఉత్సవాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. రంగనాథుని ఆలయం వద్ద ఇన్నాళ్లుగా గుట్ట చుట్టూ మార్గం లేదు. దీంతో గ్రామస్తులు, భక్తులు కలిసి కొండ చుట్టు మార్గం ఏర్పాటు చేశారు. ఈదారిని పండితుల వేదామంత్రోచ్ఛరణాల మధ్య ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.